క్లుప్తంగా

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్

తాళ్లపూడి: కలెక్టర్ ఆదేశాలు మేరకు జులైలో వృద్ధులకు ఇంటింటికీ రేషన్ సరకులు అందజేయనున్నట్టు తహసీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 2471 మందికి రేషన్ సరకులు ఇంటి వద్దే అందజేస్తారన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి ఐదు రోజులు ముందుగానే సరకులు అందజేస్తామని సివిల్ సప్లై డీటీ దివాకర్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్‌లో గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ(ఆపరేషన్స్) ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. రామన్నపాలెం, బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు


నిడదవోలు వద్ద ప్రధాన కాలువ

నిడదవోలు : పశ్చిమ డెల్టా పరిధిలో ఉపకాలువలకు బుధవారం నీటి విడుదలను పెంచారు. రైతుల సాగునీటి అవసరాల కోసం జల వనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కాలువకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా నరసాపురం కాలువకు 1843 క్యూసెక్కులు, తణుకు కాలువకు 744 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 877 క్యూసెక్కులు, ఉండి కాలువకు 937 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 412 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

తాళ్లపూడి: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని అధికారులు బుధవారం సీజ్ చేశారు. తాళ్లపూడి ఇసుక ర్యాంపులో 20 టన్నుల ఇసుకతో వెళుతున్న లారీని గజ్జరం వద్ద పట్టుకుని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు టాస్క్ ఫోర్స్ ఏఎస్సై గంగాధరరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి


సమిశ్రగూడెంలో ఎంఈఓ కేవీ గణేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు రూరల్: ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టాలను పటిష్టంగా అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని సమిశ్రగూడెంలోని మండల విద్యావనరుల కార్యాలయంలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఎంఈఓ కేవీ గణేష్‌కు సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జీఓ నెంబర్ 53, 54 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేయాలని, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం విక్రయాలపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కౌలు రైతు మృతికి సంతాపం


పొగాకు కౌలు రైతు రమేష్ మృతికి సంతాపం తెలుపుతున్న బోర్డు అధికారులు, రైతులు

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెంలో అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న పొగాకు కౌలు రైతు ఉండవల్లి రమేష్ మృతికి బోర్డు అధికారులు, రైతులు, ట్రేడర్లు సంతాపం తెలిపారు. వేలం కేంద్రంలో బుధవారం కొనుగోళ్లు ప్రారంభించే ముందు సమావేశమై.. రమేష్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో వేలం కేంద్రం వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాట్రు వీర వెంకట సత్యనారాయణ, కోశాధికారి ఆచంట సత్యనారాయణ, సలహాదారుడు నరహరిశెట్టి రాజేంద్రబాబు, సుంకవల్లి వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం


బ్రాహ్మణగూడెంలో నిడదవోలు-పంగిడి రహదారిపై వర్షం నీరు


దేవరపల్లిలో కురుస్తున్న వాన

- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- స్తంభించిన జనజీవనం

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షంతో జనసంచారం స్తంభించింది. డి.ముప్పవరం, సమిశ్రగూడెం, గోపవరం, గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయాయి. నిడదవోలు-నరసాపురం ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లో వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చాగల్లు మండలంలో విస్తారంగా వర్షాలు

చాగల్లు: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో వరి చేల్లో నీరు చేరింది. గురువారం 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. చాగల్లులో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చాగల్లు శివారులో నందిగంపాడు, మార్కొండపాడు, ఎస్ ముప్పవరం, ఊనగట్ల,దారవరం,చంద్రవరం తదితర పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది.రహదారులు పై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

మెట్ట ప్రాంతంలో జోరు వాన

దేవరపల్లి: రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. తేలికపాటి జల్లుతో కూడిన వర్షం కురుస్తుండడంతో గ్రామాల్లోని అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కొత్తగా ఏర్పడిన కాలనీల్లో కనీస రోడ్ల సదుపాయం లేక ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండి, దోమల బెడదతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. కాలనీల్లోని దారులకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో, పాములు తిరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వర్షాలకు రైతులు ఖరీఫ్ సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. పలు గ్రామాల్లో వరి నాట్లు జరుగుతున్నాయి.

సార్వా పంటలను నమోదు చేయించుకోవాలి

- వ్యవసాయాధికారి కమల్ రాజ్
- గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం
- పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


లక్ష్మీపురంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్

దేవరపల్లి: సార్వా సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా రైతులు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. కమల్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని లక్ష్మీపురం, పల్లంట్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలకరి ప్రారంభమై వర్షాలు కురుస్తున్నందున రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధం కావాలన్నారు. సార్వా పంటలు వేసిన రైతులు పంటలను అధికారులతో నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు ఎక్కువగా మన ప్రాంతంలో తినని వరి రకాలైన పీఆర్ 126, ఎస్ఎల్ఎస్ 10 వంటి ఎగుమతి రకాలను పండిస్తున్నారని ఆయన తెలిపారు. వీటి కంటే మన ప్రాంతంలో ప్రజలు వినియోగించే స్వర్ణ, పీఎల్ 1100 వంగడాలను పండిచాలని ఆయన రైతులకు సూచించారు. ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ కార్డును నమోదు చేసుకోవాలన్నారు. సీసీఆర్సీ కార్డుల ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి టి.సంజన, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

కౌలు కార్డులపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

సాక్షి ఎఫెక్ట్

పెరవలి: జిల్లాలో కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్న ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు స్పందించి వేగంగా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'సీసీఆర్ ఛీ' శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు స్పందించి కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. దీంతో నెల రోజులుగా కేవలం 14 వేలు ఇచ్చిన కార్డులు ఈ రోజు ఒక్క రోజే 500 పైగా కార్డులు రైతులకు అందించారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియలో కొన్ని ఇబ్బందులు ఉండడంతో పంపిణీ ఆలస్యమైందని తెలిపారు. రైతుల ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రెహ్మాన్

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూలై 5న శనివారం నిర్వహించనున్న మెగా లోక అదాలత్‌ను విజయవంతం చేయాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.రెహ్మాన్ అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బంది సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కేసులు ఎక్కువగా పరిష్కారం అయ్యేలా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకో తగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసుల, చిట్ ఫండ్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, మొండి బాకీ కేసులు, తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని అన్నారు. సివిల్ కేసులు రాజీ చేసుకుంటే అప్పటికే కట్టిన కోర్ట్ ఫీజు వాపస్ వస్తుందన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం ఏ కోర్ట్ కేసులు ఆ కోర్ట్ లోనే రాజీ చేసుకొనే వెసులుబాటు కల్పించామన్నారు. కక్షిదారులు ఇటువంటి చక్కటి అవకాశాన్ని వినియోగించుకుని కోర్ట్‌లో ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవడం ద్వారా తమ విలువైన సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని ఆయన కోరారు. న్యాయవాదులను పోలీస్ అధికారులను జాతీయ లోక్ అదాలత్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు సీఐ పీవీ జి.తిలక్, నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్ జె.సతీష్ బాబు, పట్టణ ఎస్ఐ జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు


అజ్జరంలో దుక్కు చేసిన పొలం


ఉసులుమర్రులో ఆకుమడి కోసం విత్తనాలు వేస్తున్న రైతు


ఉసులుమర్రులో నాట్ల కోసం దమ్ము చేస్తున్న రైతు

- నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో సాగు
- నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు

పెరవలి: ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పనులు ప్రారంభించారు. ఖరీఫ్ సాగు ముందస్తుగా వేయాలనే ఉద్దేశంతో అధికారులు జూలై ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో అందుకు అనుగుణంగా రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ప్రధాన కాలువలకు నీరు వచ్చినా చిన్న, పిల్ల కాలువలకు నీరు రావడానికి కాలువలు పనులు వలన కొంత ఆలస్యమైంది. ఇప్పటికే ముందస్తు సాగుకి సిద్ధమైన రైతులు అందుకు అనుగుణంగా బోర్లపై ఆకుమడులు వేశారు. దీంతో ఈ వర్షాలు కురవడంతో దమ్ములు జోరుగా చేస్తున్నారు.

నియోజకవర్గంలో సాగు

నిడదవోలు నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 36,500 ఎకరాల్లో రైతులు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందులో నిడదవోలులో 16,500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 11,500 ఎకరాలు, పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇప్పటివరకు విత్తన సాగు చేసే రైతులు బోర్లపై ఆకుమడులు వేయగా రైతులు చేలను దమ్ము చేసి, నాట్లు వేయడానికి చేలను దమ్ములు చేస్తున్నారు. ఆలస్యంగా నీరు వచ్చిన రైతులు ఇప్పుడు ఆకుమడులు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఖరీఫ్ సాగులో విత్తనాలు

ఖరీఫ్ సాగులో ఎక్కువగా స్వర్ణ, పిల్ రకాలతో పాటు పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1064, ఎంటీయూ1061, ఎంటీయూ 1229 రకాలు మరి కొంత మంది రైతులు సన్న రకాలు సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పెరవలి మండలంలో ఉసులుమర్రు, తీపర్రు, కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల్లో విత్తన సాగు చేయనుండగా, మిగిలిన గ్రామాల్లో పంట యథాస్థితిగా సాగు చేయనున్నారు. వ్యవసాయాధికారులు రైతులకు ముందుగా సాగు చేపడితే కలిగే లాభాలు, ఆలస్యంగా వరినాట్లు వేస్తే కలిగే నష్టాలు గురించి వివరించి చైతన్యపరుస్తున్నారు. ఏది ఏమైనా రైతులు ముందస్తు సాగు చేపడితే లాభాలతో పాటు పంట దక్కుందని అధికారులు సూచిస్తున్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

దీనిపై వ్యవసాయాధికారి మేరీ కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఆలస్యంగా నాట్లు వేయడం వలన పంటలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడుతున్నారని, దీని వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని అలాగే విత్తనాలు, ఎరువులు కూడా సొసైటీలతోపాటు డీసీఎంఎస్‌లో సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

నీరు విడుదల



ఖరీఫ్‌కు సాగునీరు వదలడంతో రైతులందరం దుక్కు దున్ని పొలాలను సిద్ధంగా ఉంచాం. నీరు రావటానికి వారం రోజుల పడుతుందని చెప్పారు. అందుకే బోర్లపై ఆకుమడులు దుమ్ము చేసి విత్తనాలు వేస్తున్నాం.

– పువ్వులు శ్రీనివాస్ రైతు కావవరం

సాగుకు సిద్ధమయ్యాం



ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోయినా ఖరీఫ్ సాగు చేయడానికి సిద్ధమయ్యాం. ఇప్పటికే చేలను దమ్ము చేయడంతో పాటు నాట్లు వేసేందుకు అన్ని సిద్ధం చేసుకున్నాం.

–మేడపాటి సూర్రెడ్డి రైతు అజ్జరం

ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ


పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఆర్డీవో రాణి సుస్మిత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ

తాళ్లపూడి: ఇసుక తవ్వకాలు జరిపే సమయంలో నిబంధనలు పాటించాలని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ప్రక్కిలంక లంక భూముల్లోని(అఖండ గోదావరి ఎడమ ఒడ్డు) ఇసుక తొలగించడానికిగాను పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆర్డీవో అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పట్టా భూముల్లో 7.6 హెక్టార్లలో ఇసుక మేటలు(డీసిల్ట్) తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ వారి ఆధ్వర్యంలో జరిగిన అభిప్రాయ సేకరణలో పలువురు గ్రామస్తులు, ఎన్జీవోలు తమ అభిప్రాయాలను తెలిపారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ర్యాంపులో పర్యావరణ అనుమతులకు అభిప్రాయ సేకరణ చేశామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, మైనింశాఖ ఏడీ ఫణిభూషన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వో విజయ కుమారి తదితతరులు పాల్గొన్నారు.

ఊనగట్ల-చాగల్లు రైల్వే గేటు ఛిద్రం



ఊనగట్ల నుంచి చాగల్లు రైల్వే గేటుకు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గోతులు

- గతుకులమయంగా రోడ్డు
- గోతులు పూడ్చని అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు

చాగల్లు: రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఊనగట్ల పాపాయి చెరువు నుంచి చాగల్లు రైల్వే గేటుకు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఊనగట్ల, గరప్పాడు, ఎస్.ముప్పవరం, నందిగంపాడు తదితర గ్రామాల ప్రజలు ఈ మార్గం నుంచే మార్కొండపాడు, చంద్రవరం, మల్లవరం గ్రామాలు వెళుతుంటారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల రైతులు ప్రతి రోజు ఈ దారి నుంచిఏ రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు పూర్తిగా చిద్రమై రాకపోకలకు ఏ మాత్రం అనుకూలంగా లేదు. దీనికి తోడు వర్షం కురిస్తే రోడ్డుపైనే నీరు నిలిచిపోయి బురదలోంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. అందువల్ల వర్షం వస్తే ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం చాలా కష్టంగా మారింది. గోతుల్లో పడి పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డు పలు చోట్ల ఛిద్రమై కుంగిపోయి దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు ఈ రోడ్డు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


ఉండ్రాజవరం వెలుగు కార్యాలయంలో జాగ్రత్తలు వివరిస్తున్న శ్రీతేజ

ఉండ్రాజవరం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని విజయవాడకు చెందిన డాన్‌బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీతేజ అన్నారు. ఉండ్రాజవరం మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, ఆశా కార్యకర్తలకు సైబర్ నేరాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉండ్రాజవరం, వడ్లూరు, దమ్మెన్ను గ్రామాలను దత్తత గ్రామాలుగా తమ సంస్థ స్వీకరించిందన్నారు. సైబర్ కేటుగాళ్లు లక్కీ డ్రా, ఉచిత రీఛార్జ్, గిఫ్ట్ కూపన్లు వంటి ఉచిత డబ్బు పొందే మార్గాలను ఆశ చూపి మన బ్యాంక్‌ల్లో నగదును కొల్లగొడుతున్నారన్నారు. సైబర్ నేరం జరిగిన గంటలోపే 1930 నంబర్‌కు కాల్ చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం బాలకోటయ్య, మండల సమాఖ్య ప్రెసిడెంట్ సీహెచ్ సౌభాగ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు తప్పనిసరి


ఉండ్రాజవరం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం: ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు అధ్యక్షతన విలేజ్ హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ సీహెచ్‌వోలకు, హెల్త్ అసిస్టెంట్లకు బుధవారం వెక్టార్ బోర్న్ డిసీజెస్ (కీటకాల వలన వచ్చే వ్యాధులపై) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులకు అనువైన కాలమన్నారు. అందరూ జాగ్రత్తలు పాటించాలని, దోమకాటు వ్యాధులైన మలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి రోజు డ్రైడేగా పాటించాలన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించవలసిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. రెగ్యూలర్ ఫీవర్‌పై సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సిబ్బంది కుమారి, ఎ.శ్రీరామ మూర్తి, మేరీరత్నం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం మీదే


విద్యార్థులను సత్కరించిన రిటైర్డ్ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.నరసింహారెడ్డి అన్నారు. బుధవారం బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్కూల్ ప్రథమంగా నిలిచిన నలుగురు విద్యార్థులను రిటైర్డ్ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నరసింహారెడ్డి మాట్లాడుతూ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని హితవుపలికారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతిభావంతులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ఇప్పటినుంచే బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు. అసోసియేషన్ సభ్యుడు, రిటైర్డ్ రైల్వే జడ్జి, ప్రముఖ కవి ఎస్ఆర్ పృథ్వీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని సాధించాలన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కాసాని జగదీష్, తేజశ్రీ, నవ్య, పావనిలను సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు గరిమెళ్ల నరసింహారావు, జి.సూర్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పద్మశ్రీ, సునీత, కళ్యాణి, లక్ష్మి, గౌతమి, శ్రీతులసి, శాంతికుమారి, బేబిరాణి పాల్గొన్నారు.